క్లుప్తంగా

నేడు ఉషశ్రీచరణ్ పర్యటన

సోమందేపల్లి: మండలంలోని రంగేపల్లి గ్రామంలో గురువారం వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షురాలు, సమన్వయకర్త ఉషశ్రీచరణ్ పాల్గొంటారని ఆ పార్టీ మండల కన్వీనర్ గజేంద్ర తెలిపారు. గుడ్ మార్నింగ్ రంగేపల్లి కార్యక్రమంలో ఉషశ్రీచరణ్ పాల్గొంటారన్నారు. కార్యక్రమానికి వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు హాజరు కావాలని కోరారు.

ఘనంగా దీక్ష పూజలు



అన్వరానంద బాబా చిత్రపటం వద్ద పూజలు చేసిన దృశ్యం

పావగడ: పట్టణంలోని పావగడ – తుమకూరు రోడ్డు సమీపంలోని సద్గురు భం భం అన్వరానంద బాబా ఆలయంలో దీక్ష పూజలను బుధవారం ఘనంగా నిర్వహించారు. ధవళ వస్త్రధారులైన దీక్షా పరులు స్వామి వారి దీక్ష తీసుకున్నారు. అన్వరానంద బాబా, సద్గురు భం భం బాబా చిత్ర పటాల వద్ద పూజలు చేశారు. కార్యక్రమంలో ఆలయ సేవా సమితి అధ్యక్షుడు టీపీ రామాంజినప్ప, సునందమ్మ తదితరులు పాల్గొన్నారు.

పావగడలో కోరేగావ్ ర్యాలీ



అంబేద్కర్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న దళిత నాయకులు

పావగడ: పట్టణంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద భీమా కోరేగావ్ విజయోత్సవ ర్యాలీని స్థానిక దళిత సంఘం నాయకలు బుధవారం ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా దళిత నాయకుడు సీకే తిప్పేస్వామి మాట్లాడుతూ.. మహారాష్ట్రలోని భీమానదీ తీరంలో రెండవ బాజీరాయుడు 1881లో మెహర్ జాతికి చెందిన 2,500 మంది దళితులపై 30 వేల మంది పేష్వేలు దాడి చేశారన్నారు. ఈ యుద్ధంలో 500 మంది మెహర్‌లు అమరులయ్యారని పేర్కొన్నారు. 30 వేల మంది పేష్వేలను మట్టి కరిపించినట్లు చెప్పారు. ఈ నేపథ్యంలో కోరేగావ్ విజయోత్సవ ర్యాలీ నిర్వహించినట్లు తెలిపారు. పావగడ పట్టణంలో భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

సందడిగా కిండర్ గార్డెన్ డే



లుంగీ డ్యాన్స్ చేస్తున్న చిన్నారులు

హిందూపురం: చిన్నారులకు ఆటపాటల ద్వారానే విజ్ఞానం పెంపొందేలా తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు కృషిచేయాలని పాంచజన్య పాఠశాల అధ్యక్షుడు శ్రీనివాసులు అన్నారు. పాంచజన్య పాఠశాలలో బుధవారం సాయంత్రం కిండర్ గార్టెన్ డే సెలబ్రేషన్స్ సందడిగా జరిగాయి. నూతన సంవత్సరానికి స్వాగతం పలుకుతూ చిన్నారులు వివిధ రకాల వేషధారణలతో ఆకట్టుకునేలా ఆటపాటలతో అలరించారు. కార్యక్రమంలో స్కూల్ అడ్మిస్ట్రేటివ్ డైరెక్టర్లు స్మిత, నందిత, గాయత్రి, భాస్కర్, విజయాంధ్ర తదితరులు పాల్గొన్నారు.

మహిళలకు చీరల పంపిణీ

లేపాక్షి: మండలంలోని చోళసముద్రం చౌడేశ్వరిదేవి అమ్మవారి దేవాలయం ఆవరణం వద్ద వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ నారాయణ స్వామి జన్మదిన వేడుకలను బుధవారం ఉదయం వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, స్థానిక ప్రజలు ఘనంగా జరుపుకున్నారు. చౌడేశ్వరిదేవికి ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం కేక్ కట్ చేసి శుభకాంక్షలు తెలియజేసారు. ఈ సందర్భంగా మహిళలకు పెద్ద ఎత్తున చీరలు పంపిణీ చేశారు. వైస్ ఎంపీపీ లీలావతి, సర్పంచ్‌లు ఆదినారాయణ, మంజునాథ్, ఎంపీటీసీ సభ్యుడు ఆదినారాయణ, బీసీ సెల్ నాయకుడు నరసింహామూర్తి, తిప్పన్న, మూర్తి తదితరులు పాల్గొన్నారు.

శ్రీరాములుకు ఘన నివాళి

పెనుకొండ రూరల్: మండల పరిధిలోని గుట్టూరుకు చెందిన దివంగత వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు, జెడ్పీటీసీ సభ్యుడు శ్రీరాములు 58వ జయంతిని గుట్టూరులో బుధవారం ఘనంగా నిర్వహించారు. శ్రీరాములు చిత్రపటం వద్ద పుష్పగుచ్ఛాలు ఉంచి కుటుంబ సభ్యులు, వైఎస్సార్‌సీపీ శ్రేణులు నివాళులర్పించారు. ఈ సందర్భంగా వైఎస్సార్‌సీపీ వాల్మీకి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పోగాకు రామచంద్ర మాట్లాడుతూ పార్టీలకు అతీతంగా రాజకీయాలలో తనదైన ముద్రవేసిన నాయకుడు శ్రీరాములు అని కొనియాడారు. బోయ, వాల్మీకుల అభివృద్ధికి కృషి చేశారన్నారు. శ్రీరాములు రాజకీయ జీవితం వాల్మీకులకు ఆదర్శమన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ నాగరత్నమ్మ, ఎంపీటీసీ నిర్మల, దుర్గప్ప, మల్లిరెడ్డి, నారాయణస్వామి, బాబు, సందీప్, నాగరాజు, రాఘవ తదితరులు పాల్గొన్నారు.



రారండోయ్ వేడుక చూద్దాం !

- భక్తుల కొంగు బంగారం అంత్య సుబ్రహ్మణ్యస్వామి
- రేపటి నుంచి 15వ తేదీ వరకూ బ్రహ్మోత్సవాలు
- 4న కళ్యాణోత్సవం, 5న బ్రహ్మరథోత్సవం
- ఏర్పాట్లు పూర్తి చేసిన అధికారులు

దేశంలోని ప్రముఖ సుబ్రహ్మణ్యస్వామి దేవాలయాల్లో నాగలమడక అంత్య సుబ్రహ్మణ్యస్వామి ఆలయం కూడా ఒకటి. కోరిన కోర్కెలు తీర్చేదైవంగా స్వామి వారు పూజలు అందుకుంటున్నారు. శుక్రవారం నుంచి స్వామివారి బ్రహ్మోత్సవాలు జరగనున్నాయి. ఉత్సవాలకు వేలాదిగా భక్తులు తరలిరానుండటంతో అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు.



సుబ్రహ్మణ్యస్వామి ఆలయం



ఆలయ పరిసరాల్లోని నాగుల కట్ట

పావగడ: కర్ణాటక రాష్ట్రంలో నాగలమడక ప్రాంతంలో ఉన్న అంత్య సుబ్రహ్మణ్యంస్వామి దేవాలయానికి ఎంతో పేరు ఉంది. పావగడ పట్టణానికి కేవలం 14 కిలో మీటర్ల దూరంలో నాగలమడక ఉంటుంది. ఉమ్మడి అనంతపురం జిల్లా వాసులు అంత్య సుబ్రహ్మణ్యస్వామిని ఎక్కువగా కొలుస్తుంటారు. తమ ఇంటి దేవుడిగా ఆరాధిస్తుంటారు. నాగలమడకలోని ఉత్తర పినాకిని నదీ పరీవాహక తీరంలో వెలసిన స్వామి వారు ఏడు పడగల సర్పాకారంలో భక్తులకు దర్శనం ఇస్తుంటారు.

పెన్నానది నుంచి ఉద్భవమూర్తి

నాగలమడక గ్రామంలో పూర్వం అన్నంభట్లు అనే బ్రాహ్మణుడు ఉండేవాడు. ఆయన కుక్కె ఆలయం నుంచి ఇక్కడికి చేరుకున్నాడు. ఒక రాత్రి సుబ్రహ్మణ్యస్వామి ఆయన కలలో వచ్చి తాను ఏడు పడగల సర్పాకారంలో పక్కనే ఉన్న పెన్నానది ఇసుకలో దాగి ఉన్నానని తనను వెలికి తీసి నది ఒడ్డున ప్రతిష్ఠించాలని కోరారట. ఆ మరునటి రోజే అన్నంభట్లు ఏటిలోని ఇసుకను నాగలితో దున్నగా ఆశ్చర్యంగా ఏడు పడగల సర్పాకార శిల నాగలి చాలుకు దొరికింది. ఆ ఉద్భవ మూర్తిని ఏటి ఒడ్డున చిన్న బండల గుడి కట్టి ప్రతిష్ఠించారు. అప్పటి నుంచి ఆ గ్రామానికి నాగలమడకగా పేరు వచ్చింది. అనంతరం కొన్నాళ్లకు సమీపంలోని అనంతపురం జిల్లా రొద్దం ప్రాంతానికి చెందిన వర్తకుడు సుబ్బయ్యశెట్టి ఎద్దుల బండిలో వ్యాపార నిమిత్తం బళ్లారికి వెళ్తూ నదీ తీరాన విశ్రమించాడు. తన వ్యాపారం లాభసాటిగా సాగితే స్వామి వారికి ఆలయం కట్టిస్తానని మొక్కుకున్నాడు. మొక్కు నెరవేరగా సుబ్బయ్యశెట్టి స్వామి వారికి ఆలయం కట్టించాడు. అప్పటి నుంచి నేటి వరకూ సుబ్బయ్యశెట్టి వారసులే బ్రహ్మోత్సవాలకు అంకురార్పణ పూజలు చేసి వేడుకలను ప్రారంభిస్తారు.

పుల్లి విస్తర్లకు అడ్డుకట్ట

ఒకప్పుడు స్వామి వారి బ్రహ్మ రథోత్సవం సందర్భంగా ఆలయంలో బ్రాహ్మణులు అన్న ప్రసాదాన్ని ఆరగించిన పిమ్మట వదిలేసిన ఎంగిలి విస్తర్ల (పుల్లి విస్తర్లు)ను భక్తులు తమ నెత్తి మీద పెట్టుకుని పక్కనే ఉన్నా పెన్నానదిలో స్నానం చేసేవారు. అలా చేస్తే కోరుకున్న కోరికలు తీరుతాయని భక్తుల నమ్మకం. అయితే ఎంగిలి విస్తర్ల కోసం వచ్చే భక్తుల తోపులాటలకు భయపడి బ్రాహ్మణులు పూర్తిగా భోజనం చేసేవారు కాదు. కొన్ని దళిత సంఘాలు దీనికి వ్యతిరేకంగా కోర్టు మెట్లెక్కడంతో పుల్లి విస్తర్లు, పొర్లు దండాల పద్ధతులను హై కోర్టు రద్దు చేసింది.

పెసర పులగం, వంకాయబజ్జీ

గత ఏడాది వర్షాలు బాగా కురవడంతో నాగలమడకలోని పెన్నానది జలకళ సంతరించుకుంది. భక్తుల స్నానాలకు, తాగునీటికి నీరు పుష్కలంగా లభిస్తోంది. ఏటి ఒడ్డున భక్తులు తమ ఇష్టదైవమైన సుబ్రహ్మణ్యస్వామి ప్రసాదంగా పెసర పులగం, వంకాయబజ్జీ వంటలను వండుకుని ఆరగించే సంప్రదాయాన్ని నేటికి పాటిస్తున్నారు.

ఆలయానికి మహర్దశ

ఎంతో ప్రసిద్ధి చెందిన నాగలమడక అంత్య సుబ్రహ్మణ్యస్వామి ఆలయానికి మహర్దశ పట్టనుంది. దాదాపు వందేళ్ల ఈ దేవాలయం రూపురేఖలు మార్చేందుకు కర్ణాటక ఎండోమెంట్ కమిషనర్‌శాఖ ఉత్తర్వులు జారీ చేసినట్లు నాగలమడక దేవాలయ ఇన్‌చార్జ్ పాలనాధికారి సునీల్ తెలిపారు. దీంతో గర్భగుడితో పాటు మొత్తం దేవాలయాన్నంతా తొలగించి ఆలయ జీర్ణోద్ధరణకు చర్యలు చేపట్టే విధంగా అడుగులు ముందుకు వేస్తున్నారు. సుమారు రూ.10 కోట్ల నిధులతో నూతన దేవాలయ నిర్మాణానికి సంబంధిత ఎండోమెంట్ అధికారులు ప్రణాళిక రూపొందించారు.

బ్రహ్మోత్సవాలు ఇలా..

అంత్య సుబ్రహ్మణ్యస్వామి జాతరోత్సవాలు జనవరి 3 నుంచి 15వ తేదీ వరకూ ఘనంగా నిర్వహించేందుకు అధికారులు అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు. 3న అంకురార్పణ, 4న ధ్వజారోహణ, కళ్యాణోత్సవం, బ్రాహ్మణ సంతర్పణం నిర్వహిస్తారు. ఉత్సవాల్లో ముఖ్య ఘట్టమైన బ్రహ్మ రథోత్సవాన్ని 5వ తేదీ జరగనుంది. 6, 7, 8, 9, 10 తేదీలలో స్వామి వారికి సర్వసేవ పూజలు భక్తులకు అన్న సంతర్పణ కార్యక్రమాలు, 11న మయూర వాహన ఉత్సవం, 12, 13, 14, 15 తేదీల్లో స్వామికి సర్వ సేవ పూజలు, భక్తులకు అన్న సంతర్పణ కార్యక్రమాలు నిర్వహిస్తారు.

సుబ్రహ్మణ్యస్వామి మహిమాన్వితుడు



నాగలమడక అంత్య సుబ్రహ్మణ్యస్వామి మా ఇంటి దేవుడు. ప్రతి ఏటా కుటుంబ సమేతంగా నాగలమడక జాతరకు వెళ్తాము. నా చిన్నతనంలో చెవుల్లో చీము కారుతుండేది. ఎన్ని మందులు వాడినా నయం కాలేదు. మా నాన్న గంగాధరశెట్టి .. స్వామిని మొక్కుకుని జాతర సందర్భంలో పుల్లి విస్తర్లు మోసి ఉత్తర పినాకిని నదిలో తల స్నానం చేశాడు. అప్పటి నుంచి చెవిలో చీము కారడం తగ్గుముఖం పట్టింది. ప్రస్తుతం ఆ పద్ధతి లేకున్నా బ్రహ్మోత్సవాలకు తప్పక వెళ్తాము.

– సుమ శ్రీధర్, భక్తురాలు, పావగడ

బ్రహ్మోత్సవాలు ఘనంగా నిర్వహిస్తాం



నాగలమడక అంత్య సుబ్రహ్మణ్యస్వామి బ్రహ్మోత్సవాలను ఘనంగా నిర్వహిస్తాము. ఈ నెల 5న జరిగే స్వామి వారి బ్రహ్మ రథోత్సవాన్ని తిలకించడానికి వేలాది మంది భక్తులు తరలివస్తారు. ముఖ్యంగా గ్రామీణ ప్రాంత ప్రజలు అధికంగా వస్తారు. నాగలమడక ప్రాంత వాసుల ఇలవేల్పు అయిన సుబ్రహ్మణ్య స్వామి పేరునే ఇక్కడి వారు ఎక్కువగా తమ సంతానానికి పెట్టుకుంటారు. బ్రహ్మ రథోత్సవం సందర్భంగా స్వామి దర్శనానికి వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అధికారులు చర్యలు చేపట్టారు.

– బదరీనాథ్, ఆలయ ప్రధాన అర్చకుడు

రక్తదాన శిబిరానికి స్పందన



రక్తదాన శిబిరంలో పాల్గొన్న వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త ఈరలక్కప్ప, అనంతరాజు

రొళ్ల: స్థానిక లక్ష్మీనరసింహస్వామి కమ్యూనిటీ భవనం ఆవరణలో నిర్వహించిన రక్తదాన శిబిరానికి స్పందన లభించింది. తాలూకా కుంచిటి వక్కలిగ సంఘం అధ్యక్షుడు, వైఎస్సార్‌సీపీ సీనియర్ నేత, స్థానిక జెడ్పీటీసీ సభ్యుడు బి.అనంతరాజు పుట్టిన రోజు సందర్భంగా కర్ణాటక రాష్ట్రం తుమకూరు జిల్లా కేంద్రం సంజీవని బ్లడ్ బ్యాంక్ ప్రతినిధులు ఈ శిబిరాన్ని ఏర్పాటు చేశారు. 28 మంది రక్తాన్ని దానం చేశారు. వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త ఈరలక్కప్ప, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొని అనంతరాజుకుపుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు. అంతకు ముందు రొళ్ల బస్టాండ్ ఆవరణలో ఉన్న మహానేత వైఎస్సార్ విగ్రహానికి అనంతరాజు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అమరాపురం, గుడిబండ మండలాల జెడ్పీటీసీ సభ్యులు స్వారక్క, భూతరాజు, తాలూకా జేసీఎస్ బూత్ ఇన్‌చార్జ్ నాగేంద్ర, అగళి మండలం వైఎస్సార్‌సీపీ నేత మహేంద్ర, మాజీ కురుబ కార్పొరేషన్ డైరెక్టర్ చంద్రప్ప, మాజీ జెడ్పీటీసీ ఉగ్రప్ప, ఎస్సీ సెల్ కార్యదర్శి హనుమంతరాయ తదితరులు పాల్గొన్నారు.

నిబంధనలు పాటించాలి

- డీఎస్పీ వెంకటేశ్వర్లు



మాట్లాడుతున్న డీఎస్పీ వెంకటేశ్వర్లు

మడకశిర: వాహనదారులు రోడ్డు భద్రత నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని పెనుకొండ డీఎస్పీ వెంకటేశ్వర్లు తెలిపారు. బుధవారం ఆయన మడకశిర పోలీస్‌స్టేషన్‌ను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రికార్డులు పరిశీలించారు. వివిధ కేసులపై సమీక్షించారు. అనంతరం డీఎస్పీ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ద్విచక్ర వాహనాలను నడిపే వారు తప్పనిసరిగా హెల్మెట్లను ధరించాలన్నారు. హెల్మెట్లు ధరించకుండా ద్విచక్ర వాహనాలను నడిపితే కేసు నమోదు చేయడమే కాకుండా లైసెన్స్‌లను రద్దు చేస్తామని తెలిపారు. రోడ్డు నిబంధనలు పాటించి పోలీసులకు సహకరించాలని కోరారు. సమావేశంలో మడకశిర అప్‌గ్రేడ్ పోలీస్‌స్టేషన్ సీఐ రాగిరి రామయ్య పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో అయ్యప్పస్వామి రథోత్సవం



అయ్యప్పస్వామి రథోత్సవాన్ని నిర్వహిస్తున్న దృశ్యం

అగళి: మండల కేంద్రంలో బుధవారం అయ్యప్పస్వామి రథోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. పురవీధుల గుండా స్వామివారిని ఊరేగించగా భక్తులు పెద్ద ఎత్తున మొక్కులు చెల్లించుకున్నారు. అయ్యప్ప నామస్మరణతో ప్రధాన వీధులు మార్మోగాయి.

కల్లు దుకాణాలపై దాడులు

పరిగి: మండల కేంద్రం పరిగిలో బుధవారం ఎక్సైజ్‌శాఖ అధికారులు కల్లు దుకాణాలపై ఆకస్మిక దాడులు నిర్వహించారు. ఈ క్రమంలో పలు దుకాణాలను పరిశీలించిన అనంతరం శాంపిళ్లను సేకరించారు. ఎక్సైజ్‌శాఖ అధికారులు నిర్వహించిన దాడులతో కల్లు దుకాణదారులు పరారయ్యారని తెలిసింది. ఈ విషయంపై హిందూపురం ఎక్సైజ్‌శాఖ సీఐ లక్ష్మీదుర్గయ్యతో వివరణ కోరేందుకు 'సాక్షి' ప్రయత్నించగా ఆయన ఫోన్‌లైన్‌లోకి అందుబాటు రాలేదు.

యూటీఎఫ్ డైరీ, క్యాలెండర్ ఆవిష్కరణ



డైరీని ఆవిష్కరిస్తున్న దృశ్యం

మడకశిర: యూటీఎఫ్ డైరీ, క్యాలెండర్లను స్థానిక ఎమ్మెల్యే ఎంఎస్ రాజు బుధవారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ తిప్పేస్వామి, యూటీఎఫ్ జిల్లా గౌరవాధ్యక్షుడు భూతన్న, కార్యదర్శి నరసింహప్ప, మండల అధ్యక్ష, కార్యదర్శులు మాలింగప్ప, జోగప్ప తదితరులు పాల్గొన్నారు.

శివాలయంలో హోమాలు



ప్రత్యేక హోమం నిర్వహిస్తున్న భక్తులు

గుడిబండ: మండల పరిధిలోని ఫళారం గ్రామంలో శివాలయం ఆవరణలో నూతన సంవత్సరం సందర్భంగా బుధవారం భక్తి శ్రద్ధలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం నుంచే ఆలయంలో మహాగణపతి పూజా, మహావేదన నివేదనము, పూర్ణాహుతి, ప్రత్యేక హోమం తదితర పూజలను వేద పండితులు నిర్వహించారు. భక్తిశ్రద్ధలతో శివ లింగానికి విశేష పూజలు చేశారు. వివిధ రకాల పూలతో శివ లింగాన్ని అలంకరించారు. అనంతరం అఖండ జ్యోతి వెలిగించి స్వామి వారికి అర్పించారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్నదానం చేశారు.



పెనుకొండ: వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షురాలు ఉషశ్రీచరణ్‌కు బొకే అందిస్తున్న ఎస్సీ సెల్ అధ్యక్షుడు నరసింహమూర్తి, తదితరులు



మడకశిర: తిరుపతిలో మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డికి శుభాకాంక్షలు తెలియజేస్తున్న మడకశిర వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త ఈరలక్కప్ప, నాయకులు



మడకశిర మండలం ఏఆర్ రొప్పంలో నూతన సంవత్సర వేడుకల్లో పాల్గొన్న వైఎస్సార్‌సీపీ శ్రేణులు



పెనుకొండ: ఎంపీపీ గీతకు శుభాకాంక్షలు తెలుపుతున్న కార్యాలయ సిబ్బంది



పెనుకొండ: బైబిల్ చర్చిలో ప్రార్థనకు హాజరైన క్రైస్తవులు



అలంకరణలో కొత్తపాళ్యం వెంకటేశ్వరస్వామి, అమరాపురం కన్యకాపరమేశ్వరి



పెనుకొండ: మంత్రి సవితకు శుభాకాంక్షలు తెలియజేస్తున్న అధికారులు

నూతన సంబరం

సాక్షిబృందం: హిందూపురం, పెనుకొండ, మడకశిర నియోజకవర్గాల్లో నూతన సంవత్సర వేడుకలు సంబరంగా జరిగాయి. బుధవారం ఉదయం నుంచే ఆయా ప్రాంతాల్లోని ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ప్రజాప్రతినిధులు, అధికారుల నివాసాలు శుభాకాంక్షలు తెలియజేసేందుకు వచ్చిన వారితో సందడిగా మారాయి.



హిందూపురం: వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో నిర్వహించిన వేడుకల్లో పాల్గొన్న నియోజకవర్గ నాయకుడు గుడ్డంపల్లి వేణురెడ్డి, నాయకులు



హిందూపురం: అలంకరణలో మహా గణపతి



రొద్దం: మాజీ మంత్రి ఉషశ్రీచరణ్‌కు బొకే ఇస్తున్న వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ తిమ్మయ్య

ఆలయానికి కాంగో డ్రమ్స్ వితరణ

పరిగి: మండలంలోని శ్రీరంగరాజుపల్లిలో అయ్యప్ప స్వామి ఆలయానికి వైస్ సర్పంచ్ మురళీమోహన్‌రెడ్డి కాంగో డ్రమ్స్ అందించారు. మాలాధారుల విజ్ఞప్తి మేరకు దాదాపు రూ.12 వేల విలువైన కాంగో డ్రమ్స్‌ను ఆలయానికి వితరణ చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు కిరణ్, గంగప్ప, నారాయణస్వామి, గురుస్వామి నరసింహప్ప, మాజీ సింగల్ విండో డైరెక్టర్ రామాంజప్ప పాల్గొన్నారు.

పరేషాన్



రేషన్ సరుకుల కోసం క్యూ కట్టిన లబ్ధిదారులు

అమరాపురం: మండల కేంద్రమైన అమరాపురం మెయిన్ బజార్‌లోని ప్రభుత్వ చౌక దుకాణంలో బుధవారం నిత్యావసర సరుకులకు లబ్ధిదారులు క్యూ కట్టారు. గంటల తరబడి వేచిచూసి సరుకులు తీసుకుంటున్నామని లబ్ధిదారులు ఆవేదన వ్యక్తం చేశారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ఇంటి వద్దనే సరుకులు తీసుకునేవారమని, ఇప్పుడు ప్రతి నెలా ఇబ్బందులు పడాల్సి వస్తోందన్నారు.